క్లుప్తంగా

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిల్ముల గంగారాం తల్లి గంగమ్మ వడదెబ్బతో అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాధితురాలిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఏ గ్రామాల్లో మనకు ఎన్ని ఓట్లు..?

కథలాపూర్: మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో పోలైన ఓట్ల వివరాల జాబితాలతో మంగళవారం చర్చలతో బిజీగా గడిపారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే విషయాలపై చర్చించారు. పెద్ద గ్రామాల్లో తమకే అధికంగా ఓట్లు వస్తాయని మూడు పార్టీల నాయకులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం. మరోవైపు పోలింగ్ రోజు సొంత పార్టీ నాయకులు ఎవరైనా ఇతర పార్టీలకు అంతర్గతంగా మద్దతు ఇచ్చారా అనే విషయాలపై నేతలు చర్చించుకున్నట్లు తెలిసింది. గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ధీమా వ్యక్తం చేస్తుండగా.. కరీంనగర్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ఫలితాలు వెల్లడయ్యే వరకు రాజకీయ నాయకుల్లో, ప్రజల్లో ఉత్కంఠ నెలకొననుంది.

గ్రామాలవారీగా పోలైన ఓట్లు

సారంగాపూర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల వారిగా పోలైన ఓట్ల సరళిని పరిశీలిస్తున్నారు. సారంగాపూర్ మండలంలో మొత్తం 20,172 ఓట్లు ఉండగా ఇందులో 15,413 ఓట్లు పోలయ్యాయి. పోతారంలో మొత్తం ఓట్లు 1607కు 1162 ఓట్లు పోలయ్యాయి. సారంగాపూర్‌లో 1014 ఓట్లు, రేచపల్లిలో 3286 ఓట్లు, రంగపేటలో 997 ఓట్లు, నాగునూర్‌లో 726 ఓట్లు, లచ్చక్కపేటలో 697 ఓట్లు, కోనాపూర్‌లో 1645 ఓట్లు, పెంబట్ల 1593 ఓట్లు పోలయ్యాయి. లక్ష్మీదేవిపల్లిలో 1686 ఓట్లు, అర్పపల్లిలో 1847 ఓట్లు, బట్టపల్లిలో 424 ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 76.40 పోలింగ్ శాతం నమోదైయింది.

అధ్వానంగా జూనియర్ కళాశాల రోడ్డు


కథలాపూర్‌లో రోడ్డు పరిస్థితి

కథలాపూర్: మండలకేంద్రంలో జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే చాలు రోడ్డుపై నీరు ప్రవహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లడానికి కష్టంగా మారుతోంది. మరో 15 రోజుల్లో విద్యాసంస్థలు ప్రారంభమవుతున్నందునా రోడ్డును ఇప్పుడు మరమ్మతులు చేస్తేనే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిస్తే మరమ్మతులు చేయడం కష్టంగా ఉంటుందంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి త్వరగా విద్యాసంస్థల రోడ్డును మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాహనదారుల తిప్పలు


రేచపల్లి-పోతారం మధ్య రోడ్డు దుస్థితి

సారంగాపూర్: మండలంలోని పోతారం రేచపల్లి గ్రామాల మధ్య, రేచపల్లి-తాట్లవాయి గ్రామాల మధ్య రోడ్డుపై కంకర వేసి వదిలిపెట్టడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పోతారం క్రాసింగ్ నుంచి రేచపల్లి వరకు, రేచపల్లి నుంచి తాట్లవాయి వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రెండు బిట్లు కలిపి రోడ్డు మొత్తం పొడవు 9.70 కిలోమీటర్లు. ప్రభుత్వం రూ. 2.90 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం కంకర వేసి తారు వేయకపోవడంతో వాహనదారులు, కాలినడకన వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు. వెంటనే తారు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ వివరణ కోరగా, వారం రోజుల్లో తారు రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోరుట్ల: అప్పుల బాధతో కోరుట్ల పట్టణం రాంనగర్ ఏరియాకు చెందిన ఇందూరి చారి (24) మంగళవారం సాయంత్రం యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన బంధువులు వెంటనే అతడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. చారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

పిక్కలు తీస్తున్న కుక్కలు!

- నాలుగు నెలల వ్యవధిలో 358 మందికి గాయాలు
- ఒకే రోజు 11 మందికి గాయాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- భయాందోళనలో పట్టణ ప్రజలు


కుక్కల దాడిలో గాయపడ్డ వ్యక్తి


రాయికల్ గాంధీచౌక్ వద్ద గుంపులు గుంపులుగా కుక్కల సంచారం

రాయికల్: పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. దీంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈనెల 7న కుక్కలు దాడిచేయడంతో 11 మందికి తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటిక్యాల క్రాసింగ్ రోడ్, గాంధీచౌక్, శివాజీనగర్, మాదిగకుంట, కేశవనగర్ లాంటి ప్రాంతాల్లో వీటి సంఖ్య ఎక్కువగా ఉంది. సుమారు నాలుగు నెలల వ్యవధిలోనే 358 మంది కుక్క కాటుకు గురైనట్లు సూపరింటెండెంట్ రవి తెలిపారు. శునకాల బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడేందుకు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పాలకవర్గం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో ఇటు మనుషులతో పాటు, మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. గతంలో కుక్కల బెడద నివారించడం కోసం ఇతర ప్రాంతాలకు తరలించినప్పటికీ మళ్లీ యథావిధిగా కుక్కలు పట్టణానికి రావడంతో కుక్కల సంఖ్య పట్టణంలో సుమారు వెయ్యికి పైగా చేరింది. దీంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి



రాయికల్ పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. గత వారం రోజుల క్రితం కుక్కకాటుతో చిన్నారులకు సైతం తీవ్రగాయాలయ్యాయి. రాత్రుల పూట ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద తీర్చాలి.

– రాజేశ్, రాయికల్

చర్యలు తీసుకుంటున్నాం



పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. వాటి నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలోని కుక్కలను మరోచోటకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. పట్టణ ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దు.

– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

బాధిత కుటుంబ సభ్యులకు విప్ పరామర్శ


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న విప్

మేడిపల్లి: భీమారం మండలంలోని మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేశ్ దుబాయిలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.రూ.10 వేల సాయం అందజేశారు.. మృతదేహాన్ని త్వరగా తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి, కుటుంబ సభ్యులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ధర్మపురి: విశ్రాంత ఇంజినీర్ సంగనభట్ల సాంబయ్య అకాల మరణం ధర్మపురికి వాసులకు తీరని లోటని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ రామకృష్ణ తండ్రి సాంబయ్య సోమవారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ధర్మపురికి చెందిన బొల్లారపు లక్ష్మి, జైనా గ్రామానికి చెందిన గడ్డెందుల దుబ్బయ్య, దొంతాపూర్‌కు కర్నె రమేశ్, కొండ సత్తన్నలు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను విప్ పరామర్శించి రమేశ్ కుటుంబానికి రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మెట్‌పల్లి: కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మేజిస్ట్రేట్ పావని అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో మంగళవారం మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గతేడాది పార్లమెంట్ మూడు చట్టాలను సవరించిందన్నారు. న్యాయవాదులతో పాటు ప్రజలు ఇలాంటి వాటిని అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి మంగళవారం తెలిపారు. రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీలు ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థులు ఉదయం ఆరు గంటలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. ప్రతిభ చూపిన వారిని వచ్చే నెలలో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు.


మూసుకుపోయిన డ్రైయినేజీ కాలువ


ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు

ఇళ్లలోకి మురుగునీరు..

కోరుట్ల: పట్టణంలోని డైమండ్ రెస్టారెంట్ ఎదురుసందులో మురికి కాల్వ పూర్తిగా పూడుకుపోవడంతో మురికి నీరు కాల్వలో నిలిచిపోయి చుట్టుపక్కల ఇండ్ల జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మహిళల ఓట్లే కీలకం..

- పురుషుల కన్నా 1.20 లక్షల మంది ఎక్కువ వినియోగం
- ఏడు సెగ్మెంట్లలో వారిదే ఆధిక్యం


మెట్‌పల్లిలో ఓటేసేందుకు బారులుతీరిన మహిళలు

కోరుట్ల: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో పురుషుల కన్నా మహిళలే అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. వీరి ఓట్లు ఎవరికి దక్కుతాయన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అన్ని ప్రధాన పార్టీలు మహిళల ఓట్లు తమకే వస్తాయన్న ఆశతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పోలింగ్ ముందు అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా మహిళా ఓటర్లను మచ్చిక చేసుకోవడంపై దృష్టి సారించి చివరికి మహిళా సంఘాల వారీగా డబ్బులు పంపిణీ చేసినట్లు జోరుగా ప్రచారం జరిగింది.

అన్ని సెగ్మెంట్లలో వారిదే అధిపత్యం

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ ఏడు సెగ్మెంట్లలో కలిపి మొత్తం 17,04867 ఓట్లు ఉండగా వీరిలో పురుష ఓటర్ల సంఖ్య 8,06,130 ఉండగా మహిళా ఓటర్ల 8,98,647 సంఖ్య ఉంది. ఈ లెక్కన సుమారుగా మహిళల ఓట్లు లక్ష వరకు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఏడు సెగ్మెంట్లలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఒక్క నిజామాబాద్ అర్బన్ మినహా, ప్రతీ సెగ్మెంట్‌లోనూ పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లు సుమారు 8 వేల నుంచి 25 వేల మేర అధికంగా పోలయ్యాయి. పోలయిన పురుషుల ఓట్లకు మహిళల ఓట్లకు మధ్య తేడా సుమారు 1.20 లక్షల వరకు ఉండటంతో సదరు ఓట్లు ఎవరికి దక్కితే వారి గెలుపు ఖాయమన్న ప్రచారం సాగుతోంది.

ఎవరి ఆశలు వారివే..

ఎన్నికల ప్రచారం ప్రారంభం అయినప్పటినుంచి ప్రధాన పార్టీల నాయకులు మహిళల ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రచారపర్వంలో పార్టీల కీలక నేతలు వచ్చిన సమయంలో మహిళలు ఎక్కువ సంఖ్యలో ప్రచార సభలకు వచ్చేలా జాగ్రత్త పడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం, మహిళల పేరిట ఇందిరమ్మ ఇల్లు, గ్యాస్ సిలిండర్ల ధర తగ్గింపు, గృహజ్యోతి, పింఛన్ల పెంపు వంటి పథకాలను గుర్తు చేస్తూ మహిళా ఓటర్లను తమ వైపు మళ్లించుకునే ప్రయత్నాలు సాగించాయి. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో పోలయిన మహిళా ఓట్లు తమకే దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆశపడుతున్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల కోసం అమలు చేస్తున్న సుకన్యయోజన, రేషన్, గ్యాస్ సబ్సిడీలో తమ భాగస్వామ్యం, గర్భిణులకు ప్రసూతి సాయం, నిరుపేద మహిళలకు ఇళ్ల కేటాయింపులో కేంద్రం వాటా వంటి అంశాలను ప్రచారంలో ప్రస్తావించి వారిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. ఇక బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ హయాంలో మహిళలకు చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. పోలింగ్‌కు ఒక్క రోజు ముందు కొన్ని పార్టీలు ప్రలోభపర్వానికి తెరలేపి మహిళా సంఘాలకు కానుల పంపిణీకి తెగబడటం గమనార్హం. మొత్తం మీద ఎవరికి వారు ప్రచారపర్వంలో మహిళల ఓట్లు ఆకట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలతో పెద్ద ఎత్తున మహిళల ఓట్లు పోలయ్యాయి. ఈ క్రమంలో సదరు ఓట్లు తమకే దక్కుతాయన్న ఆశల్లో ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారు గెలుపు అంచనాల్లో తలమునకలవుతున్నారు.

సెగ్మెంట్ల వారీగా పోలైన మహిళల ఓట్లు

ఆర్మూర్	17,693
బోధన్	8,658
నిజామాబాద్ అర్బన్-	3,316
నిజామాబాద్ రూరల్	26,155
బాల్కొండ	27,448
కోరుట్ల	21,474
జగిత్యాల	16,415
అధికంగా పోలయిన మహిళల ఓట్లు:	1,21,159

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


చుట్టూ పిచ్చిమొక్కలతో నిండిన ట్రాన్స్‌ఫార్మర్

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలువ వద్ద పిచ్చి మొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వైర్లకు పిచ్చి మొక్కలు ఉండడంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఒకవైపు వంగి ఉండటం వలన ట్రాన్స్‌ఫార్మర్ ఈదురు గాలులకు కింద పడిపోయే అవకాశాలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీకి కసరత్తు

- మండలంలో రూ. 3 కోట్లతో పనులు
- ఏడాదిలో చేపట్టిన పనుల పరిశీలన


ఉపాధిహామీ రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో ఏడాది కాలంలో చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు సుమారు రూ. 3 కోట్ల పనులు చేపట్టారు. ఈ మేరకు ఉపాధిహామీ సామాజిక తనిఖీల అధికారుల బృందం బుధవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని రికార్డులను సేకరించనున్నారు. ఇప్పటికే మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల వారిగా ఏడాదికాలంలో చేసిన పనుల రికార్డులను పరిశీలించి మండలాధికారులకు అప్పగించారు. ఈ రికార్డులను సామాజిక తనిఖీ చేసే అధికారుల బృందానికి అప్పగిస్తామని ఏపీవో రాజేందర్ పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటపడితే వాటిని వారం రోజుల్లోనే రికవరీ చేస్తారని సంబంధిత అధికారులు తెలిపారు.

కొన సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు


కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యపురాశులు

మల్యాల:మండలంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. రెండు, మూడు రోజులుగా వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురవడంతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీనికితోడు తూకం వేసిన తర్వాత ధాన్యం బస్తాలు తరలించేందుకు లారీలు ఆలస్యంగా వస్తుండడంతో తూకం వేసిన బస్తాలు వర్షానికి తడిస్తే, రెండింతలు హమాలీ ఖర్చులు అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు త్వరగా లారీలు పంపాలని రైతులు కోరుతున్నారు.

ఓటెత్తిన మహిళలు

- నియోజకవర్గంలో 73.35 శాతం
- వెల్గటూర్‌లో అధికంగా 75.71 శాతం


ధర్మపురిలో ఓటు వేసిన మహిళలు

ధర్మపురి: నియోజకవర్గంలో సోమవారం జరిగిన పెద్దపెల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మహిళ ఓటర్లే పైచేయిగా నిలిచారు. పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓట్లు వేసి తమ సత్తా చాటుకున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 2,30,786 మంది ఓటర్లున్నారు. వారిలో 1,12,442 పురుషులు కాగా 1,18,338 మంది మహిళలున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నిలకను ప్రశాంతంగా నిర్వహించారు. అత్యధికంగా వెల్గటూర్ మండలం 75.71 శాతం పోల్ కాగా అతి తక్కువ ధర్మపురి 69.78 శాతం పోలైంది. బుగ్గారంలో 72.66 ధర్మారం 73.80, ఎండపెల్లి 74.58, గొల్లపల్లి 75.06, పెగడపెల్లిలో 73.86 శాతం ఓటింగ్ నమోదైంది.